# చరిత్రలో చెరగని కృషి చేసినవాడు

**బాలగోపాల్** హఠాన్మరణం దిగ్భ్రాంతిని గొలిపింది. ఆయన పౌరహక్కుల ఉద్యమాన్ని బలంగా నడిపిన ఉద్యమకారుడు. వరంగల్లులో 1985కు ముందు ఒక అర్ధ దశాబ్ది హేతువాద ఉద్యమం నడిచింది. అప్పుడు తరచు ములుగు, పసర, దేవరుప్పల, హన్మకొండల్లో మేము సభలు, క్లాసులుపెట్టి చైతన్యం చేస్తూ ఉండేవాళ్లం. వరంగల్లు జిల్లాలో నక్సల్స్ మూమెంట్ ముమ్మరంగా నడుస్తున్న రోజులవి. పీపుల్స్ వార్‌కు అనుబంధ సంస్థలైన ఆర్‌వైఎల్, ఆర్ఎస్‌యు మొదలైన సంస్థలు ఇంకా వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తూ ఉండేవి. ముఖ్యంగా విరసం, పౌరహక్కుల సంఘం యాక్టివ్‌గా ఉండేవి. ఆ కాంలో బాలగోపాల్‌కి పౌరహక్కుల ఉద్యమ నేతగా గొప్ప పేరు అక్కడ ఉంది. ఆయన నిరాడంబరంగా ఉండటం ఎన్‌కౌంటర్‌లు జరిగిన దగ్గరకు వెళ్ళి 'ఫ్యాక్ట్ ఫైండింగ్' చేసి సత్యాన్ని బయటకి నిర్భయంగా చెప్పటం చేస్తూ ఉండేవారు. నక్సలైట్ మూమెంట్ శక్తివంతంగా నడుస్తుండటం వలన దాని ప్రభావం పౌరహక్కుల ఉద్యమం మీద, విరసం మీదపడి వీళ్ళ నిజనిర్ధారణలకు మంచి ప్రతిష్ఠ వచ్చింది. ఆ సందర్భంలో ధైర్యంగా పని చేసిన వారిలో బాలగోపాల్ ఒకరు. అపుడు నక్సలైట్ అనుబంధ సంస్థల్లోగాక మరియే ఇతర సంస్థలో పని చేసినవారినైనా అభ్యుదయవాదులు కాదనే పరిస్థితి ఉంది. హేతువాద ఉద్యమం అపుడు మార్క్సిజం పునాదుల మీద నడిచేది ఒక శాఖ. ఎంఎన్ రాయ్‌లైన్‌లో నడిచేది మరొక శాఖ ఉండేవి. మేము మార్క్సు గతితార్కిక భౌతిక, చారిత్రక దృక్పథంతో హేతువాద ఉద్యమం నడపాలని తీర్మానం చేశాం. అపుడు విరసంలో ఉన్న వరవరరావు, బాలగోపాల్,

కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావుల్లో త్రిపురనేనికి తాత్వికంగా మంచి పునాదీ, క్లారిటీ ఉండేవి. కె.వి. రమణారెడ్డి చారిత్రక దృక్పథం కలిగిన విమర్శకుడిగా ఉండేవాడు. వరవరరావుకి మంచి ఉపన్యాసకుడిగా పేరుంది. బాలగోపాల్‌కు విరసం కంటే, పౌరహక్కుల ఉద్యమంలోనే పేరు వచ్చింది.

1985 కారంచేడు దురాగతం జగిరినపుడు పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణకు వచ్చింది. వాళ్ళు కారంచేడులో నరికిన, చంపిన భూస్వాములను కూడా ఇంటర్వ్యూ చేశారని మేము వ్యతిరేకించాం. వాళ్ళు ఆ డాక్యుమెంటులో కేవలం భూస్వాములు అని వాడడం, కమ్మ భూస్వాములు అని వాడకపోవడం మీద మేము చర్చపెట్టాం. దళిత పౌరహక్కుల పోరాటం అంబేద్కర్ మార్గంలోనే నడుస్తుంది. పౌరహక్కుల వారు చెప్పే వర్గ దృక్పథంతో కాదని సిద్ధాంతపరమైన చర్చలోకి దిగాం. అపుడు బాలగోపాల్ ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి. ఆయన తరఫున సుబ్రహ్మణ్యం చర్చించారు. పౌరహక్కుల ఉద్యమం సిద్ధాంతపరమైన చర్చలలో ఉన్నా దళిత ఉద్యమాన్ని సపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 1వ తేదీన మేము 'ఛలో చీరాల' నిర్వహించాం. మూడు లక్షల మంది దళిత ప్రజలు సమీకరించబడ్డారు. ఆ రోజుకు ముందు రామనాథన్ హత్య వరంగల్లులో జరిగింది. దళిత ఉద్యమం స్పష్టంగా అంబేద్కర్ మార్గాన్ని తీసుకున్నా పౌరహక్కుల ఉద్యమం దళిత ఉద్యమాన్ని కొంతమేరకు సపోర్టు చేయడం వలన పీపుల్స్‌వార్‌కు దళిత ఉద్యమానికి సంబంధాన్ని అంటగట్టడానికి పోలీసులు ఒక ప్రయత్నం చేశారు. అపుడు మాది అంబేద్కర్ మార్గమేకాక, ప్రజాస్వామ్య పద్ధతిలో మా ఉద్యమాన్ని ఎలా నడపదల్చామో లోకానికి చాటాం. ఆ తరువాత బాలగోపాల్, విరసంలో కొందరు వరంగల్లులో నివసించే పరిస్థితులు లేవని హైదరాబాద్ చేరారు. కన్నాభిరాన్ వీరికి అండగా నిలబడడంలో ముఖ్యపాత్ర వహించారు. అపుడు బాలగోపాల్ తనకు ఇష్టమైన కొశాంబి రచనల సమీక్ష గ్రంథాన్ని హెచ్‌బిటీ ఆధ్వర్యంలో తెచ్చారు. ఇపిడబ్ల్యూకి పుస్తక సమీక్షలు రాశారు.

ఆయనెపుడూ మార్క్సు వాదాన్నిగాని, అంబేద్కర్‌ని, ఫూలేని గాని అధ్యయనం చేసినట్లు చెప్పుకోలేదు. లెక్కల విద్యార్థిగా డాక్టరేట్ పొందిన స్కాలర్‌గా, లెక్చరర్‌గా అందులో ప్రావీణ్యత సంపాదించాడు. ఆ క్రమంలో సాహితీ విమర్శకుడిగా శాస్త్రీయమైనవాదనలే ఆయన చేశారు. త్రిపురనేనంత తాత్విక విమర్శకుడు

కాకపోయినా, కె.వి. రమణారెడ్డి అంత సాహితీ చారిత్రక విమర్శకుడు కాకపోయినా, వరవరరావు అంత ఉపన్యాసకుడు కాకపోయినా బాలగోపాల్‌కు తనకంటూ ఒక ముద్ర రావడానికి కారణం పౌరహక్కుల సంఘానికి అనేక సందర్భాలలో ఉద్యమరూపం తేవడమే. నిరంతరం చలనంలో ఉండటం ఆయన నైజం. బాగా చదవరి. తత్వశాస్త్రంలో రస్సెల్‌ను చదివాడంటారు. రస్సెల్ ప్రతిపాదించిన ప్రధానమైన హేతువాదం మీద మరి ఈయనేమీ రాయలేదు. చరిత్రలో కోశాంబిని వివరించాడేగాని తానుగా ఒక చారిత్రక కోణాన్ని వివరించలేదు.

ఆయన మార్క్సిజం నుండి విడిపడటంలో కూడా స్పష్టతలేదు. గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని నిరాకరిస్తూ ఆయనేమీ రాయలేకపోయాడు. ఆంధ్రలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అనేక మంది మేధావులు తమ జీవితం చివరిలో అటు మార్క్సిజంలో కానీ, ఇటు అంబేద్కరిజంలో కాని లేదా భారతీయ తాత్విక వాదం బౌద్ధంలోగానీ, నిలవలేకపోవడానికి కారణం వారు పుట్టి పెరిగిన కుటుంబాల గిరులు ఎక్కడో మేధస్సులో పేరుకుని ఉండటమే. శ్రీశ్రీని మంత్రోచ్చారణలతో దగ్ధం చేసినా, కొ.కు. బుద్ధికొలత సిద్ధాంతమైనా, చలం రమణాశ్రమానికి చేరినా, బాలగోపాల్ మార్క్సువాదాన్ని వ్యతిరేకించినా ప్రత్యామ్నాయ తాత్విక అంశాలను వీరు ప్రతిపాదించలేకపోవడానికి కారణం వీరి కుటుంబ సంస్కృతే. భారతదేశ పునాది అంశమైన కులం పునాదిని, వర్గ పునాదిని ధ్వంసం చేసే ఒక గొప్ప తాత్విక అధ్యయనాన్ని వీరు విస్మరించడమే. అనేక సందర్భాలలో మిత్రులు కూడా నిజం చెప్పకుండా దాచేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బ్రాహ్మణ కుటుంబాల నుండి వచ్చిన కన్నాభిరాన్, బాలగోపాల్, హరగోపాల్, వరవరరావు వీరందరూ పౌరహక్కుల కోసం పోరాడి ధైర్యంగా బూటకపు ఎన్‌కౌంటర్లుగా తేల్చడంలో చేసిన కృషిని మరువలేం. వీరికున్న వెసులుబాటు ఏమంటే, అనేక సందర్భాలలో వీరి వ్యతిరేక శక్తులు కూడా వీరి జననాన్ని బట్టి వీరికి సహకరించడం జరుగుతుంది. బాలగోపాల్ కూడా పర్సనల్‌గా బిఎస్ రాములుతో మాట్లాడేటపుడు, మాకు బ్రాహ్మణ పుట్టుకనుబట్టి ప్రచారం ఇస్తూ వుంటారు. ఓన్ చేసుకుంటారు. డిజోన్ చేసుకోరు అన్నారని చెప్పారు. ఇది నిజం. ఒకరు మరణించినపుడు ఆయన్ని పొగడడం తప్ప ఈ సమాజానికి వారు ఏమందించారో బ్రాహ్మణులు చూడరు. అన్ని తరగతుల బ్రాహ్మణులు బాలగోపాల్‌ను

సొంతం చేసుకుంటే ఆయన వ్యక్తిత్వానికి ప్రమాదం.

మార్క్సిజం వర్గనిర్మూలన చెప్తుంది. దానిని బాలగోపాల్ అంగీకరించలేదు. అంబేద్కరిజం కులనిర్మూలన చెప్తుంది. దానిని బాలగోపాల్ అంగీకరించలేదు. మార్క్సుని, అంబేద్కర్‌ని సమన్వయిస్తూ కొందరు కుల వర్గ పోరాట నిర్మూలన చెప్తున్నారు. దాన్ని ఆయన అంగీకరించలేదు. ఆయన స్వయంగా ఒక ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కనిపెట్టి నలుగురికి బోధించలేదు. మరి ఆయన సమాజానికి ఏమందించారు. సింపుల్‌గా ఉండటం, సంక్షిప్తంగా మాట్లాడటం, నిరంతరం ప్రజలతో సంబంధాలతో ఉండటం అనే వ్యక్తిత్వాంశాలు రాబోయే తరాలకు ఉపకరిస్తాయి. పౌరహక్కుల ఉద్యమం నుండి బొజ్జా తారకం, ఓపిడిఆర్ నుండి వచ్చిన కంచె ఐలయ్య, ఉ. సాంబశివరావు వంటి వారు దళిత బహుజన ఉద్యమాలను తాత్వికంగా శక్తివంతం చేశారు. కులాధిపత్యాన్ని ఈ పౌరహక్కుల సంఘాలు వ్యతిరేకించడం లేదనే వారు బయటకు వచ్చారు. పీపుల్స్‌వార్ నుండి బయటకు వచ్చిన సత్యమూర్తి పార్టీలో విరసంలో బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకించారు.

భారతదేశంలో కులం సమస్య ప్రధానమైందని దళిత ఉద్యమం చర్చ పెట్టింది. ఈ చర్చల్లో బ్రాహ్మణ కులాల నుండి వచ్చి విప్లవ ఉద్యమంలో ఎదిగినవారు పాల్గొనడానికి ఇష్టపడలేదు. వారు కులంపై, అస్పృశ్యతలపై పోరాడటానికి సిద్ధపడలేదు. బాలగోపాల్ కూడా ఎప్పుడూ కులాధిపత్యం మీద మాట్లాడలేదు. ముఖ్యంగా మానవహక్కుల వేదిక ఆయన నిర్మించుకున్నాక సిద్ధాంత స్పష్టత తగ్గింది. మహాత్మాఫూలే, అంబేద్కర్‌లు భారతదేశంలో మానవహక్కుల పోరాటం నడిపినవారు. వీరి సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ఎలా మానవహక్కుల పోరాటం విజయవంతం అవుతుంది? సామాజిక ఉద్యమాలకు సంబంధం లేకుండా, రాజ్యహింస, గృహహింస, టెర్రరిస్టు హింసకు పరిమితమైతే భారతదేశ పునాది అంశాలు మారతాయా! కమ్మ, రెడ్డి, వెలమ, రాజు అగ్రకులాలతో పీడించబడే ఎస్‌సి, ఎస్‌టి, బిసిల సామాజిక హింస సంగతి ఏమిటి? స్త్రీలపై జరిగే పితృస్వామ్య కులహింస సంగతి ఏమిటి? ఈ ప్రశ్నలన్ని ముందుకు వస్తున్నాయి. అంబేద్కర్‌ని, ఫూలేని చదవనివారికి ఈ పరిమితులు ఉన్నాయి.

ఒక వ్యక్తి ఒక ఉద్యమంగా, ఒక రచయితగా, ఒక ఉపన్యాసకుడిగా జీవించినపుడు

వాళ్ళని విస్తృతిని పరిమితిని సరిగా అంచనా వేయలేకపోతే చరిత్రకు తప్పుడు సంకేతాలు వెళతాయని వరవరరావు దళితుల్లో పుట్టిన జన్ను చిన్నాలు ఎన్‌కౌంటర్ అయినపుడు అన్నారు. అసలు నక్సలైట్ ఉద్యమానికి నెత్తురుపోసి, ఆ సూర్యుణి వెలిగించింది దళితులే గదా! దాని కిరణాల వలన వచ్చిన కీర్తిని వీళ్ళు పొందుతున్నారు. ఈ మధ్య హైదరాబాదులో ఎవరు చనిపోయినా, ఒక భజంత్రీల బృందం ఏర్పడి అంతటివారు, అంతటివారని పొగడడంతో అసలు చనిపోయినవాడి వ్యక్తిత్వం మరుగునపడుతోంది. ఏ సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారి వ్యవస్థను విమర్శిస్తున్నారో, ఆ సామ్రాజ్యవాదులు విప్లవాన్ని, సామాజిక విప్లవాన్ని నీరుగార్చడానికి పెట్టిన ఎన్‌జిఓ సంస్థలను కూడా వీళ్ళే వాడుకుంటున్నారు. వారు నడిపే సమాచార వ్యవస్థకు వీళ్ళే ఊపిరి పోస్తున్నారు. ఈ వైరుధ్యాలపై మాట్లాడితే మూకుమ్మడిగా ఒక ముఠాలాగా దాడులు కూడా చేస్తున్నారు. అందువల్ల సత్యాలు మరుగునపడుతున్నాయి. చివరకు స్త్రీవాద, దళితవాద, గిరిజనుల, మైనారిటీ ఉద్యమాలను కూడా మేమేనడుపుతున్నాం అని ఆపాదించుకొనే దశకు వచ్చారు.

ఈ దశలో బాలగోపాల్ వంటి వారు స్పష్టంగా చేసిన పని, ఆ తరువాత కొనసాగించటంపై చర్చ జరగడంలేదు. బాలగోపాల్ పౌరహక్కుల సంఘం నుండి బయటకు వచ్చాక అది లెటర్ ప్యాడ్ ఉద్యమంగా ఎందుకు మారిపోయింది? ఆయన మార్క్సు సిద్ధాంతం నుండి వైదొలగినా వరవరరావు వంటి వాళ్లు సిద్ధాంతపరంగా ఎందుకు ఖండించడంలేదు. అంబేద్కర్ మీదగాని మహాత్మపూలేమీదకాని వీళ్ళు ఎపుడూ ఎందుకు రాయడంలేదు. దళిత బహుజన నాయకత్వాన్ని వీరెందుకు ఎంకరేజ్ చేయడం లేదు? బాలగోపాల్‌ని తనకు తానుగా చేసిన కృషికి ప్రచారం రానివ్వండి.

ఏది ఏమైనా ఆయన అకాల మరణం ఒక పెద్ద లోటు. 57 ఏండ్లకే ఆయన జీవితం ముగుస్తుందనుకోలేదు. ఆయన చేసిన కృషి చెరిగిపోదు అనేది సత్యం.

**- కత్తి పద్మారావు**

*అక్టోబర్ 14, బుధవారం, 2009 'వార్త' దినపత్రికలో*